
సాక్షి ఆదిలాబాద్

బుధవారం, 4, అక్టోబర్, 2023



ఆటో బోల్తా.. 8లో▸

ఆదిలాబాద్‌రూరల్ మండలం పొచ్చర సమీపంలో గల వంతెనపై నుంచి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి.



వైభవంగా 'రుషి పంచమి'

ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంట గ్రామంలో రుషి పంచమి ఉత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

కైలాస్‌నగర్: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చి వారి సమ్మె విరమింపజేయాలని వైఎస్సార్‌టీపీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం అమలు, పెన్షన్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు పెందుర్ మనోహర్, రాష్ట్ర నాయకులు శంకర్, పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లాం, రాహుల్‌రెడ్డి, కృష్ణంరాజు, సైబాజీ పాల్గొన్నారు.

ఐఆర్ 18శాతం ప్రకటించాలి

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు కేవలం 5 శాతం ఐఆర్ ప్రకటించడం ఆశ్చర్యానికి గురిచేసిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ కనీసం 18 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. పీఆర్సీ నియామకాన్ని స్వాగతిస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏ, ఈహెచ్‌ఎస్ ప్రకటించకపోవడం అసంతృప్తిగా ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

ప్రభుత్వం పునరాలోచించాలి

ఎదులాపురం: ఐఆర్ ప్రకటన విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ కమిటీ వేయడాన్ని సాగతిస్తున్నామన్నారు. అయితే 18 శాతం ఐఆర్ కోసం ఎదురు చూస్తుండగా కేవలం ఐదు శాతం ప్రకటించడం సరికాదన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని ప్రభుతాన్ని కోరారు. ఇందులో సంఘం నాయకులున్నారు.

20 శాతం ప్రకటించాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ప్రకటించిన ఐదుశాతం మధ్యంతర భృతి (ఐఆర్) ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, 20 శాతానికి పెంచాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, వలభోజు గోపీకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత పీఆర్సీలో ఐఆర్ లేకుండా 30 నెలల వేతనాన్ని ఉద్యోగులు కోల్పోయారన్నారు. ప్రస్తుతం 20శాతం ఐఆర్‌తో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇందులో ఆ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

జయవంత్‌రావు కుటుంబాన్ని ఆదుకుంటాం



నివాళులర్పిస్తున్న డీఎస్పీ, పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: గుండెపోటుతో మృతిచెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ జయవంత్‌రావు కుటుంబాన్ని ఆదుకుంటామని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తక్షణ సాయం కింద రూ.20వేలు అందజేసినట్లు చెప్పారు. పార్థివ దేహాన్ని డీఎస్పీ ఉమేందర్, పోలీసు అధికారులు సందర్శించి నివాళులర్పించారు.

104 ఉద్యోగుల రిలే దీక్షలు

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రతతో పాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే డిమాండ్లతో 104 సేవల ఒప్పంద ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట మంగళవారం రిలే దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.



ప్రక్రియను పరిశీలిస్తున్న విద్యాశాఖ ఉద్యోగులు

ఆగుతూ.. సాగుతూ

- స్కూల్ అసిస్టెంట్లకు స్థానచలనం
- జిల్లాలో 334 మంది ఉపాధ్యాయుల బదిలీలు
- ఎస్‌ఏ తెలుగు, హిందీ, పీడీలకు తాత్కాలిక బ్రేక్
- రిలీవర్ వస్తేనే.. కొత్త స్థానంలో చేరిక

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ఆగుతూ ముందుకు సాగుతోంది. గతనెల 3న ప్రారంభం కాగా మంగళవారంతో పూర్తి కావాల్సి ఉంది. అయితే కోర్టు కేసులు, వివిధ కారణాలతో ప్రక్రియకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. టెట్ కారణంగా ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు నిలిచిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బదిలీల్లో భాగంగా ఎస్జీటీలకు ఇప్పటికే స్థానచలనం జరగాల్సి ఉండగా, మళ్లీ రీషెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు సోమవారం రాత్రి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన వారు నూతన పాఠశాలల్లో మంగళవారం విధుల్లో చేరారు. కొన్నేళ్లుగా నిరీక్షిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ఎట్టకేలకు బదిలీ జరగడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతుంది. అయితే ఎస్‌ఏ తెలుగు, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ల బదిలీలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ ప్రక్రియ ముందుకు సాగుతుందా.. లేదా అని వారిలో ఆందోళన మొదలైంది. ఎస్జీటీ రీషెడ్యూల్ విడుదలతో వీరికి ఉత్తర్వులు అందుతాయో.. లేదోనని దిగాలు చెందుతున్నారు. భాషా పండితులు, పీఈటీ పోస్టుల ఉన్నతీకరణ, ఎస్జీటీలను కలుపుకొని ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. పీఈటీ, భాషా పండిత పోస్టులను అప్‌గ్రేడ్‌తో ఆయా పాఠశాలల్లోని పోస్టుల ఖాళీలు పెరగడంతో మంచి పోస్టులు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

334 టీచర్లకు బదిలీలు..

బదిలీ ప్రక్రియలో భాగంగా జిల్లాలో 620 మంది వెబ్ ఆప్షన్ పెట్టుకున్నారు. అయితే 334 మందికి స్థానచలనం జరిగింది. వీరంతా కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరారు. ఎస్‌ఏ తెలుగు, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ ఉపాధ్యాయులకు బదిలీలు నిలిచిపోయాయి.

జెడ్పీ యాజమాన్యంలో..

బదిలీ జరిగిన పోస్టుల్లో జెడ్పీ యాజమాన్యంలో 16 మంది తెలుగు మీడియం పీఎస్ హెచ్‌ఎంలకు, బయోసైన్స్ మరాఠీ మీడియంలో 2, బయోసైన్స్ తెలుగు మీడియంలో 30, ఎస్‌ఏ ఇంగ్లిష్‌లో 46 మందికి బదిలీలు అయ్యాయి. అలాగే ఎస్‌ఏ మరాఠీలో 2, ఎస్‌ఏ మరాఠీ మీడియం గణితంలో 1, ఎస్‌ఏ గణితం తెలుగు మీడియంలో 66, ఎస్‌ఏ గణితం ఉర్దూ మీడియంలో 3, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ తెలుగు మీడియంలో 52, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ ఉర్దూ మీడియంలో 5, ఎస్‌ఏ సోషల్ తెలుగు మీడియంలో 51, ఎస్‌ఏ సోషల్ ఉర్దూ మీడియంలో 3 బదిలీలు పూర్తయ్యాయి.

ప్రభుత్వ యాజమాన్యంలో..

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని ఎస్‌ఏ బయోసైన్స్ మరాఠీయంలో 1, ఎస్‌ఏ బయోసైన్స్ తెలుగు మీడియం 6, ఎస్‌ఏ బయోసైన్స్ ఉర్దూ మీడియం 1, ఎస్‌ఏ ఇంగ్లీష్ 21, ఎస్‌ఏ గణితం తెలుగు మీడియంలో 9, ఎస్‌ఏ గణితం ఉర్దూ మీడియంలో 3, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ తెలుగు మీడియంలో 9, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ ఉర్దూ మీడియంలో 1, ఎస్‌ఏ సోషల్ మరాఠీ మీడియంలో 1, ఎస్‌ఏ సోషల్ తెలుగు మీడియంలో 4, ఎస్‌ఏ సోషల్ ఉర్దూ మీడియంలో ఒకరికి స్థానచలనం జరిగింది. జిల్లాలో మొత్తం 334 మంది టీచర్లకు బదిలీలు జరిగాయి.

రిలీవర్ వస్తేనే.. కొత్త బడికి

బదిలీ జరిగిందని సంబరపడ్డ కొంతమంది ఉపాధ్యాయులకు విద్యాశాఖ నిర్ణయం నిరాశకు గురిచేసింది. బదిలీ అయిన ఉపాధ్యాయులు పనిచేసే స్థానంలో రిలీవర్ వస్తేనే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఆదేశించింది. రేషనలైజేషన్ నిబంధనలు పాటించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఒక పాఠశాలల్లో రెండు పోస్టులు ఉండి ఇద్దరికి బదిలీ జరిగి వారి స్థానంలో ఒకే రిలీవర్ వస్తే సీనియర్ ఉపాధ్యాయుడిని రిలీవ్ చేయాలని తెలిపింది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రిలీవర్ వస్తే తప్పా ఆ ఉపాధ్యాయుడు కొత్త పాఠశాలకు చేరకుండా అక్కడే పనిచేయాల్సి ఉంటుందని సూచించింది. విద్యార్థుల చదువుకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు చెబుతున్నారు.

తాత్కాలిక బ్రేక్..

బదిలీల కోసం నిరీక్షిస్తున్న ఎస్‌ఏ తెలుగు, ఎస్‌ఏ హిందీ, ఫిజికల్ డైరెక్టర్ ఉపాధ్యాయులకు బదిలీలు జరగకపోవడంతో నిరాశలో ఉన్నారు. ఈ బదిలీలను తాత్కాలికంగా నిలిపివేస్తారా.. లేక త్వరలో బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారా అనే విషయాన్ని విద్యాశాఖ ప్రకటించకపోవడంతో దీర్ఘకాలికంగా ఒకే పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వీరిలో ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో ఎస్‌ఏ హిందీ ఉపాధ్యాయులు 3, ఎస్‌ఏ తెలుగు 9, ఎస్‌ఏ ఉర్దూ 2, ఫిజికల్ డైరెక్టర్లు ఇద్దరు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అలాగే జెడ్పీ యాజమాన్యంలో ఎస్‌ఏ హిందీ 21, ఎస్‌ఏ తెలుగు 25, ఫిజికల్ డైరెక్టర్లు ఆరుగురు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తున్నారు.

ఎస్జీటీ బదిలీల రీషెడ్యూల్..

విద్యాశాఖ ఎస్జీటీల బదిలీ ప్రక్రియకు సంబంధించి రీషెడ్యూల్ ప్రకటించింది. ఇందులో భాగంగా ఈనెల 3, 4 తేదీల్లో తేదీల్లో స్పౌజ్ కేటగిరీ దరఖాస్తులపై అభ్యంతరాలు, ఎడిట్ ఆప్షన్, 5న ఖాళీలు, సీనియారిటీ జాబితా విడుదల, 6, 7 తేదీల్లో ఎస్జీటీ, పీఈటీ ఉపాధ్యాయుల బదిలీల కోసం వెబ్ ఆప్షన్, 8న దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించింది. అయితే 9, 10 తేదీల్లో వీరి బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

సంక్షేమ 'లబ్ధి'పై ఆరా..

- పథకాల ప్రగతిపై సర్కారు దృష్టి
- స్కీం, లబ్ధిదారుల వారీగా వివరాలు సేకరణ
- ఉన్నతాధికారులకు నివేదించిన యంత్రాంగం



కైలాస్‌నగర్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా రావచ్చనే ప్రచారం నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం లబ్ధిదారుల సమాచారంపై దృష్టి సారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా జిల్లాలో లబ్ధి పొందిన వారి వివరాలను ఆయా శాఖల ద్వారా సేకరిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారులు ప్రభుత్వానికి సమాచారంతో కూడిన నివేదిక పంపించినట్లుగా తెలుస్తోంది. ఏ పథకం ద్వారా ఎంత మంది లబ్ధి పొందారు.. వారి వివరాలేంటి.. ఫోన్ నంబర్లు వంటి సమగ్ర సమాచారాన్ని అందజేసినట్లుగా సమాచారం. త్వరలో లబ్ధిదారులకు వ్యక్తిగతంగా మెసేజ్‌లు గానీ, ఫోన్ ద్వారా గానీ ఆరా తీసేందుకు ఈ సమాచారం అడిగినట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వ పనితీరుపై లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకునేందుకు సైతం అవకాశం లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సమస్త సమచారం సేకరణ

తొమ్మిదేళ్ల పాలనలో అమలైన ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రయోజనం పొందిన లబ్ధిదారుల సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం సేకరించినట్లుగా తెలుస్తోంది. స్కీం వారీగా, లబ్ధిదారు వారీగా ఫోన్ నంబర్లతో సహా వారి వివరాలను కోరినట్లుగా సమాచారం. ఆసరా పింఛన్లు, రైతు బంధు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, రైతు బీమా, రుణమాఫీ, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, దళిత బస్తీ, దళిత బంధు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ శాఖల ద్వారా అందించిన స్కాలర్‌షిప్‌లు, ఆర్‌ఓఎఫ్ఆర్ హక్కు పత్రాలు, కేసీఆర్ కిట్, న్యూట్రిషియన్ కిట్, ఆరోగ్యశ్రీ, ఉద్యోగాలు, సంక్షేమ శాఖల ద్వారా అందించిన ఆర్థికసాయం రుణాలు, స్వయం ఉపాధి రుణాలు వంటి తదితర అన్ని ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆయా శాఖల ద్వారా సేకరిస్తోంది. రాష్ట్ర ఉన్నాతాధికారుల నుంచి అందిన ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం తమ శాఖ పరిధిలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, వాటితో ప్రయోజనం పొందిన లబ్ధిదారులు వంటి వివరాలతో కూడిన సమాచార నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి ఇటీవల పంపించినట్లుగా తెలిసింది.

పనితీరుపై ఆరా...

జిల్లాలోని మండలం, గ్రామం యూనిట్‌గా ఆయా సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను ఫోన్ నంబర్లతో సహా ప్రభుత్వం సేకరిస్తోంది. జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు పురస్కరించుకుని ఇటీవల జిల్లాలో 20 రోజుల పాటు అట్టహాసంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఇప్పటికే శాఖల వారీగా అమలు చేసిన కార్యక్రమాలు, లబ్ధిదారుల వివరాలను అధికారులు ఆయా కార్యక్రమాల్లో ప్రజలకు తెలిపారు. వాటి వివరాలతో ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీల ద్వారా ప్రచారం కూడా కల్పించారు. తాజాగా ప్రభుత్వం మరోసారి గ్రామం, లబ్ధిదారు పేరు, ఏ పథకం కింద లబ్ధి పొందారు, వారి ఫోన్‌నంబర్ వంటి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తుండటం ఆసక్తి కలిగిస్తోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తొమ్మిదేళ్ల పాలనపై లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకోసమే ఈ సమాచారాన్ని సేకరిస్తున్నట్లు అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

వైభవంగా 'కొంచవలి' జాతర



పూజల్లో డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ తదితరులు

తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) శివారు గుట్టపై ఉన్న కొంచవలి దర్గా జాతర మంగళవారం వైభవంగా సాగింది. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చాదర్ సమర్పించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దర్గా అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జొన్నగట్కా, మటన్‌తో అన్నదానం చేశారు. కార్యక్రమంలో భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ రవూఫ్, ఎంపీటీసీ రాకేశ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామయ్య ఉన్నారు.

ప్రసాదంగా గట్కా, మాంసం

జాతరకు హాజరైన ప్రతీ ఒక్కరికి జొన్న గట్కా లడ్డూ, మేక మాంసం ప్రసాదంగా ఇవ్వడం ఆనవాయితీ. ఇందులో భాగంగా నిర్వాహకులు ఈ ఏడాది ఐదు క్వింటాళ్ల గట్కా సిద్ధం చేశారు. అలాగే ఈ గ్రామస్తులు మతసామరస్యానికి ప్రతీకగా దశాబ్దాలుగా ఈ జాతర నిర్వహిస్తున్నారు.



ప్రసాదం కోసం సిద్ధం చేసిన జొన్న గట్కా

వైద్యసేవలు మెరుగుపర్చేందుకు కృషి

- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్
- నార్నూర్‌లో 'నీతి ఆయోగ్ సంకల్ప సప్తాహ ఆకాంక్ష'

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నామని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లాలోనే వెనుకబడిన మండలంగా నార్నూర్‌ను నీతి ఆయోగ్ గుర్తించింది. ఈ మేరకు స్థానిక సీహెచ్‌సీలో నీతి ఆయోగ్ సంకల్ప సప్తాహ ఆకాంక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు అయ్యేలా చూస్తున్నామన్నారు. గడిచిన నెల వ్యవధిలో ఈ సీహెచ్‌సీలో 30 ప్రసవాలు నమోదవడమే నిదర్శనమన్నారు. ఆస్పత్రిలో మరిన్ని సౌకర్యాలతో పాటు త్వరలోనే పూర్తిస్థాయి సిబ్బందిని నియమిస్తామన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వాగ్వాదం

ఏజెన్సీ ప్రాంతంలో సీహెచ్‌సీగా ఏర్పాటు చేసి ఏడాదవుతున్నా వైద్యులను ఎందుకు నియమించలేదని కాంగ్రెస్ నాయకుడు కరీంఖాన్ ఆందోళనకు దిగాడు. ఈ క్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్‌తో పాటు ఇతర నాయకులు అతడితో వాగ్వాదానికి దిగారు. వారికి సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఎంపీడీవో రమేశ్ నచ్చజెప్పేయత్నం చేశారు. అందరు సమన్వయంతో పని చేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతబాయి, డీఎంవో శ్రీధర్, డీఐవో శ్రీకాంత్, ఎంపీడీవో రమేశ్, ఏవో రమేశ్, సీడీపీవో శారద, వైద్యుడు రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, చిత్రంలో ఎంపీపీ మోతుబాయి తదితరులు

అమాత్యా.. ఆలకించండి

- బోథ్ డివిజన్ ఏర్పాటు చేయాలి
- కుప్టి ప్రాజెక్టుపై దృష్టి సారించాలి
- నియోజకవర్గవాసుల విన్నపం
- నిర్మల్‌కు నేడు మంత్రి కేటీఆర్ రాక

బోథ్: నిర్మల్ జిల్లాకు రాష్ట్ర మంత్రి కేటీఆర్ నేడు రానున్నారు. ఈ నేపథ్యంలో బోథ్ నియోజకవర్గ వాసులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా బోథ్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే 80 రోజులుగా దీక్ష చేస్తూ, వినూత్న నిరసనలతో ఆందోళన కొనసాగిస్తున్నారు. విషయాన్ని పలుమార్లు మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో ఉద్యమం ఉధృతం చేస్తున్నారు. ఎన్నికల్లోపు సానుకూలంగా స్పందించాలని, లేకుంటే పోలింగ్‌కు దూరంగా ఉంటామని స్పష్టం చేస్తున్నారు. అలాగే డివిజన్‌తో పాటు నియోజకవర్గ కేంద్రంలో ఉండాల్సిన కార్యాలయాలు, ఫైర్ ఇంజిన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే నేరడిగొండ మండలం కుప్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలని సీఎం కేసీఆర్ గతంలో నిర్ణయించారు. అధికారులు డీపీఆర్ సైతం సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

రిమ్స్‌కు 'క్రిటికల్ కేర్'

- రూ.23 కోట్ల నిధులు మంజూరు
- అత్యవసర సేవలు త్వరలోనే అందుబాటులోకి..
- రిఫర్ కేసులకు ఇక చెక్



రిమ్స్ ఆస్పత్రి

ఆదిలాబాద్‌టౌన్: రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు మరిన్ని అత్యసవర సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో రోగుల ఇక్కట్లు తీరనున్నాయి. రిమ్స్‌కు క్రిటికల్ కేర్ సెంటర్ మంజూరు చేస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం పలు మెడికల్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన వీటిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిన శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో మంజూరు చేసిన ఈ సెంటర్ కూడా ప్రారంభించాల్సి ఉండగా, సాంకేతిక కారణాలు, అధికారులకు లింక్ రాకపోవడంతో ప్రక్రియ జరగలేదు. త్వరలోనే ఈ యూనిట్‌కు శంకుస్థాపన చేపట్టనున్నారు.

రూ.23 కోట్లతో..

క్రిటికల్ కేర్ నిర్మాణం, ఇతర మౌలిక వసతులు, పరికరాల కోసం ప్రభుత్వం రూ.23 కోట్ల నిధులు కేటాయించింది. రిమ్స్ ఆవరణలో భవనాన్ని నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అప్పటివరకు ఔట్‌బ్లాక్ కేంద్రంలో ఈ సేవలు కొనసాగిస్తామని రిమ్స్ అధికారులు పేర్కొంటున్నారు. క్రిటికల్ కేర్‌లో ఆక్సిజన్, వెంటిలెటర్లు, ఇతర సౌకర్యాలతో పాటు ఇందుకు అవసరమైన వైద్యాధికారులు, సిబ్బందిని నియమించనున్నారు.

ప్రాణాలకు భరోసా..

జిల్లా కేంద్రంలో రిమ్స్ ఆస్పత్రి ఉన్నప్పటికీ అత్యవసర సమయాల్లో రోగుల ప్రాణాలు నిలబెట్టలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం క్రిటికల్ కేర్ మంజూరు చేసింది. ముఖ్యంగా పురుగుల మందు, ఇతర విషపదార్థాలు సేవించిన వారి కోసం, రోడ్డు ప్రమాద క్షతగాత్రులు, గుండెపోటు వచ్చిన వారి ప్రాణాలకు ఈ యూనిట్ భరోసా ఇవ్వనుంది. ప్రస్తుతం రిమ్స్‌తో పాటు జిల్లాలో ఎక్కడ కూడా క్రిటికల్ కేర్ లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంటుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఘటనలు జరిగిన సమయంలో సకాలంలో మెరుగైన వైద్యసేవలందక పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. హైదరాబాద్, నిజామాబాద్, యవత్మాల్, నాగ్‌పూర్ తదితర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్న సమయంలో రోగులను తరలించేందుకు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆస్పత్రులకు వెళ్తామో లేదోననే సందేహంతోనే చాలా మంది మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి క్రిటికల్ ఘటనలకు ఈ కేంద్రంలో అత్యవసర, అత్యాధునిక చికిత్స అందనుంది. అలాగే రోగులను రిఫర్ చేసే ప్రక్రియకు చెక్ పడనుంది. ఆర్థిక ఇబ్బందులతో రిమ్స్‌లో చేరే పేద రోగులకు ఇది ఎంతగానో మేలు చేయనుంది. జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి రిమ్స్ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే వారికి ఈ సెంటర్ అండగా నిలవనుంది. గతంలో ఓ ఫారెస్ట్ ఉన్నతాధికారితో పాటు చాలా మంది గుండెపోటు వచ్చి రిమ్స్‌లోనే ప్రాణాలను వదిలేసిన ఘటనలు లేకపోలేదు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల్లో గాయాలపాలైన అనేక మంది రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణిస్తున్న సంఘటనలో చోటుచేసుకుంటూనే ఉన్నాయి. రిమ్స్‌లో క్రిటికల్‌కేర్ సెంటర్ మంజూరుపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రిటికల్ కేర్ మంజూరుతో మేలు

రిమ్స్‌కు ప్రభుత్వం క్రిటికల్ కేర్ మంజూరు చేసింది. రూ.23 కోట్ల నిధులు కేటాయించింది. అత్యవసర పరిస్థితుల్లో ఈ సెంటర్ ఎంతగానో దోహదపడనుంది. రిమ్స్ ఆవరణలోనే నూతన భవనాన్ని నిర్మించడం జరుగుతుంది. అప్పటివరకు తాత్కాలికంగా ఆస్పత్రిలోని ఓపీ బ్లాక్‌లో సేవలు అందిస్తాం. దీనికి సంబంధించి ఇంకా పూర్తి వివరాలు అందలేదు.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వుషూ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

భైంసాటౌన్: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్‌స్థాయి వుషూ పోటీల్లో ప్రతిభ కనబర్చిన పలువురు జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి వై.రమణరావు, ఇన్‌చార్జి డీవైఎస్‌వో నఫేఖాన్ తెలిపారు. మంచిర్యాలలో సోమవారం జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో జిల్లా నుంచి ఐదుగురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సాక్షి(45 కేజీలు) బాసర, లోకేశ్వరం కేజీబీవీకి చెందిన సంధ్య (48 కేజీలు), అనిత (56 కేజీలు), బాలుర విభాగంలో బాసరకు చెందిన శ్రీనివాస్(40 కేజీలు), సోమేశ్ (45కేజీలు) ఎంపికయ్యారు. త్వరలో మహబూబాబాద్‌లో జరిగే 67వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కోచ్ శ్రీరాముల సాయికృష్ణ, నగేష్, చందుల స్వామి ఉన్నారు.

పాత నేరస్తుడికి రూ.లక్ష జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని పాత నేరస్తుడికి తహసీల్దార్ రూ.లక్ష జరిమానా చెల్లించాలని మంగళవారం నోటీసులు జారీ చేశారు. గంజాయి విక్రయిస్తున్న కేసులో ఈఏడాది జూలైలో టూటౌన్ పోలీసులు అప్పటి తహసీల్దార్ ఎదుట ఖుర్షీద్‌నగర్‌కు చెందిన నజర్ అలీ ఖాన్‌ను బైండోవర్ చేశారు. అయినా అతని తీరులో మార్పు రాకపోగా, గతనెల 28న మరోసారి గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. మంగళవారం టూటౌన్ సీఐ అశోక్ అర్బన్ తహసీల్దార్ ఎదుట నేరస్తుడిని ప్రవేశపెట్టగా రూ.లక్ష జరిమానా చెల్లించాలని నోటీసులు జారీ చేశారు.

మొక్కలకు ట్రీగార్డులు



రాష్ట్రమంత్రి కేటీఆర్ బుధవారం నిర్మల్ పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారిపై డివైడర్ల మధ్యలో మున్సిపల్ అధికారులు మొక్కలు నాటారు. అయితే ఆ మొక్కలు కాస్త పశువులు తినేయడంతో ఆదివారం 'కర్రలే మిగిలాయి'శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేశారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

నిమ్మల..శత్రుదుర్భేద్యం

- మూడంచెల రక్షణ వ్యవస్థ
- మొసళ్లతో చుట్టూ కాలువ
- ఓరుగల్లును తలపించే మట్టిగోడ
- ఆపై.. చైనావాల్‌లా రక్షణగోడ
- చెరువులో 'నడ'ఇక్కడి ప్రత్యేకత



నిర్మల్ తూర్పు భాగంలో గొలుసుకట్టు చెరువులు, రక్షణ గోడ(వృత్తంలో

నిర్మల్: నిమ్మల..450 ఏళ్ల కిందట నిర్మితమైన రాజ్యం. పాలకులు, అధికారుల పట్టింపులేక కాలగర్భంలో కలిసిపోతున్న చరిత్రను కదిలిస్తుంటే.. ఎన్నో విశేషాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు, చరిత్ర తెలుసుకోవాలన్న స్థానిక ఔత్సాహికులు చేస్తున్న కృషిలో నిర్మల్‌వాసులకే తెలియని నిమ్మల ఘనత వెలుగులోకి వస్తోంది. రాజ్యరక్షణ కోసం తీసుకున్న చర్యలు, చేపట్టిన కట్టడాలు నేటితరం విస్తుపోయేలా ఉన్నాయి. అంచెలంచెలుగా నిర్మించిన రక్షణ వ్యవస్థలో శత్రుదుర్భేద్యంగా నిమ్మల రాజ్యం నిలిచిన తీరు ఆకట్టుకుంటోంది. ఈనెల 4న జిల్లాకు రానున్న మంత్రి కేటీఆర్ పలు చారిత్రక ప్రదేశాల పరిరక్షణ, పర్యాటక అభివృద్ధికి కృషిచేశారు. ఇదే తరహాలో నిమ్మలనూ గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

మూడంచెలుగా..

నిమ్మనాయుడు నిర్మించిన నిమ్మల అనంతరం కుంటి వెంకట్రాయుడు, శ్రీనివాసరావుల కాలంలో చాలా నిర్మాణాలను నోచుకుంది. శత్రువులతో పాటు, దొంగల దాడుల నుంచి రక్షణ కోసం పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేశారు. మూడంచెలుగా దీన్ని నిర్మింపజేశారు.

- నిమ్మల రాజ్యంలో ముందుగా అడుగు పెట్టాలంటే కందకం దాటుకుని రావాలి. కనీసం 33 అడుగుల వెడల్పు, 20 అడుగుల లోతుతో ఉండే ఈ కందకాల్లో మొసళ్లను ఉంచేవారు. గొలుసుకట్టు చెరువుల్లోకి మొసళ్ల చేరకుండా చెరువు-కందకానికి మధ్యలో అడ్డుగోడలు నిర్మించడం విశేషం. స్థానిక చైన్‌గేట్ వద్ద బాహుబలి సినిమాలో చూపించినట్లు భారీ గేటు కందకం పైనుంచి భారీ గొలుసులతో పైకి ఎత్తేలా నిర్మాణం ఉండేది.
- శత్రువులు, దొంగలు కందకాన్ని దాటుకుని వచ్చినా రెండో రక్షణ అంచెగా దిబ్బలుదిబ్బలుగా మట్టిగోడ ఉండేది. ఎత్తయిన ఈ మట్టిగోడలు ఎక్కేంతలోపే శత్రువులను మట్టుపెట్టేలా రాజ్యసైనికులు చర్యలు చేపట్టేవారు.
- చైనావాల్‌ను తలపించేలా నిమ్మల రాజ్యం చుట్టూ రక్షణగోడను నిర్మించారు. 10-15 అడుగుల ఎత్తులో మధ్యమధ్యలో బురుజులతో కట్టారు. పూర్తిగా రాళ్లు, డంగుసున్నం, కాల్చిన ఇటుకలతో నిర్మించిన గోడకు లోపలివైపు దాని వెంట నడవడానికి దారిని నిర్మించడం విశేషం. ఇప్పటికీ బంగల్‌పేట్, వెంకటాద్రిపేట్ మధ్య ఈ పొడవాటి రక్షణగోడ కనిపిస్తుంది.
- నిమ్మల పాలకులు ఊరిచుట్టూ గొలుసుకట్టు చెరువులతో అనుసంధానంగా కందకం, మట్టిగోడ, రక్షణగోడలను నిర్మించారు. లోతైన, విశాలమైన చెరువులను తవ్వించినప్పటికీ వాటి వెంట రక్షణగోడ నిర్మాణాన్ని కొనసాగించారు. ఇప్పటికీ వెంకటాద్రిపేట ఖజానా చెరువులో ఇలాంటి రక్షణగోడ కనిపిస్తుంది. దీన్ని స్థానికులు 'నడ'గా పిలుస్తారు. ఇప్పటికీ ఈ గోడ నిర్మాణం అలాగే ఉంది. ఇటీవల వర్షాలకు ఖజానా చెరువు ఈ నడ నీటిలో మునిగిపోయింది.
- నిమ్మల రక్షణ వ్యవస్థలో రహస్యమార్గాలు ప్రత్యేకం. బయటకు వెళ్లడానికి దారులు నిర్మించిన తీరు అబ్బురపరుస్తుంది. తూర్పువైపు ఎత్తయిన రక్షణగోడకు బంగల్‌పేట్ శివారు, వెంకటాద్రిపేట్ శివారులో సింహ(రాజ)ద్వారాలు ఉన్నాయి. ప్రస్తుతం వెంకటాద్రిపేట్ ద్వారం ఓ వైపు శిథిలమైంది. ఇక ప్రధాన ద్వారాలు కాకుండా సైనికులు, పాలకులు రహస్యంగా వంగి వెళ్లడానికి దారులు నిర్మించారు. స్థానికులు ఇప్పుడు వీటిని దొంగకిటికీలుగా పిలుస్తున్నారు. ఇక మూడో రహస్య మార్గంగా చేపట్టినవి రక్షణగోడకు పూర్తిగా దిగువన, భూమిని ఆనుకుని నిర్మించారు. వీటి గుండా కేవలం పాకుతూ వెళ్లాల్సి ఉంటుంది. చూడటానికి సొరంగ మార్గాలుగా కనిపిస్తాయి. ఇందులో చాలావరకు శిథిలావస్థకు చేరాయి.




గొలుసుకట్టు చెరువులను ఆనుకుని నిర్మించిన ఎత్తయిన బురుజులు



నిర్మల్ ఉత్తరం వైపు రక్షణగోడ, మధ్యలో బురుజులు

వంగి నడుస్తూ వెళ్లే రహస్య మార్గం



నిమ్మల అద్భుత నిర్మాణం



నిమ్మనాయుడు ఆ తర్వాత కేవలం ఐదారుగురు రాజుల పాలనలోనే నిమ్మల రాజ్యం అద్భుతంగా నిర్మితమైంది. గొలుసుకట్టు చెరువులు, వాటిని అనుకుని చేపట్టిన మూడంచెల రక్షణ వ్యవస్థ ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయి. ఓరుగల్లు, గోల్కొండ తరహాలో ప్రభుత్వం నిమ్మలను కాపాడుతూ ఘనమైన వారసత్వ చరిత్రను ముందుతరాలకు చూపించాల్సిన అవశ్యకత ఉంది.

\- థోండి శ్రీనివాస్, కొత్త తెలంగాణ బృందం సభ్యుడు

నిర్మల్‌లో జాబ్‌మేళాకు స్పందన

- హాజరైన 1500 మంది నిరుద్యోగులు



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరయ్యారు. రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరై మాట్లాడారు. జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మున్ముందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

303 మంది ఆఫర్ లెటర్లు

మేళాకు 1500 మంది నిరుద్యోగ యువత హాజరు కాగా, 30 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఫ్యూచర్ స్టాపింగ్ సొల్యూషన్, అపోలో ఫార్మసీ, మెడ్‌ప్లస్, రాక్సా సెక్యూరిటీ ప్రైవేట్ లిమిటెడ్, ఈ కామ్ ఎక్స్‌ప్రెస్, ఐసీఐసీఐ ప్రోడెన్షియల్ తదితర కంపెనీల్లో 303 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు.

తెలంగాణలోనే గౌడ కులస్తుల సంక్షేమం

నిర్మల్: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలోనే గౌడకులస్తుల సంక్షేమం కోసం కృషిచేస్తున్నామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌కె కన్వెన్షన్‌లో మంగళవారం మోకుదెబ్బ గౌడ జనగర్జన సభ నిర్వహించారు. అంతకుముందు పాపన్న విగ్రహం, అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి ర్యాలీగా వచ్చారు. తెలంగాణలో కల్లుగీత కార్మికులకు పింఛన్లు, బీమా పరిహారం, పలు సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్ సర్కార్‌దేనన్నారు. కల్లుగీత కార్మికుల ఉపాధి కోసం నీరాకేఫ్‌ల ఏర్పాటు దిశగా అడుగేసిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో లైసెన్స్‌ల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీఇచ్చారు. గీత కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు సర్వాగౌడ్, ప్రధానకార్యదర్శి రాములుగౌడ్, బాలరాజ్‌గౌడ్, బాలేశంగౌడ్, నర్సింహులు గౌడ్, నీరజగౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్, జిల్లాలతోపాటు మహారాష్ట్రకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

గిరిజన మహిళ దారుణ హత్య

- తుకారాంనగర్‌లో ఘటన



మెస్రం దేవుబాయి మృతదేహం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగాపూర్ పంచాయతీ పరిధి లోని తుకారాంనగర్‌లో గిరిజన మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన కలకలం రేపింది. ఉట్నూర్ ఎస్సై మనోహర్ కథనం ప్రకారం .. తుకారాంనగర్‌కు చెందిన మెస్రం దేవుబాయి (45), మెస్రం మోతీరాం భార్యభర్తలు. గ్రామ సమీపంలో తనకున్న పత్తి చేనులో సోమవారం సాయంత్రం వరకు దేవుబాయి పనులు చేసుకుంటూ ఉంది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో భర్త చుట్టుపక్కల గాలించాడు. ఆచూకీ దొరకకపోవడంతో ఇంటికి వచ్చాడు. మంగళవారం చేనుకు వెళ్లిన మోతీరాం అక్కడ రక్తపు మరకలు కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి చేరుకోగా చేనులో రక్తపు మడుగులో దేవుబాయి మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, మంత్రాల నెపమా.. లేక ఇతర కారణాలతోనైనా.. మహిళను హత్య చేసి ఉంటారా అని పోలీసులు అనుమానిస్తున్నారు. భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి నలుగురు సంతానం ఉన్నారు. తల్లి మృతితో చిన్నారుల ఏడుపు పలువురిని కంటతడి పెట్టించింది. సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆటో బోల్తా

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పొచ్చర సమీపంలో గల వంతెనపై నుంచి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన విద్యార్థులు ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్‌లో గల ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆటోలో 15 నుంచి 18 మంది విద్యార్థులు ఉన్నారు. స్థానికులు వారిని బయటకు తీశారు. గాయపడ్డ ఇద్దరిని రిమ్స్‌కు తరలించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

తలమడుగు: విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి చెందాడు. ఎస్సై ధనశ్రీ కథనం ప్రకారం..మండలంలోని కప్పర్‌దేవికి చెందిన కోరంగ వెంకటి (30) గ్రామ సమీపంలోని వాగులో విద్యుత్ తీగలతో చేపలు పట్టేవాడు. మంగళవారం విద్యుత్ తీగలు వాగులో వేసి చేపలు పడుతుండగా షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య నిర్మల ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహం గుర్తింపు

జైనథ్: మండలంలోని భోరజ్ సమీపంలోని ఓ దాబా వద్ద లభించిన గుర్తు తెలియని మృతదేహం మహారాష్ట్రలోని వాసిమ్ జిల్లా సావలికి చెందిన బంసోడే దత్త అని పోలీసులు మంగళవారం గుర్తించారు. కుటుంబీకులు, బంధువులు గుర్తించి అతని మృతిపై ఎలాంటి అనుమానం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం వివరించారు.

గుండెపోటుతో కాగజ్‌నగర్ ఆర్డీవో మృతి



జాడి రాజేశ్వర్ (ఫైల్)

ఆసిఫాబాద్/ఉట్నూర్ రూరల్: కుమురంభీం జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కాగజ్‌నగర్ ఆర్డీవో జాడి రాజేశ్వర్ మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల పనిచేసిన రాజేశ్వర్ హఠాన్మరణం పొందడంతో ఆయనతో పనిచేసిన ఉద్యోగులు దిగ్భ్రాంతి చెందారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం కాగజ్‌నగర్ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారానికి ఒకసారి స్వగ్రామానికి వస్తుంటారు. కుటుంబంతో గడిపేందుకు సోమవారం సాయంత్రం సొంతూరికి వచ్చారు. తిరిగి విధులకు వెళ్లేందుకు మంగళవారం ఉదయం సిద్ధమయ్యారు. స్నానం చేసేందుకు బాత్‌రూంకు వెళ్లిన ఆయన చాలాసేపటి వరకు బయటికి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బాత్‌రూం తలుపులు పగులగొట్టారు. అచేతనంగా కిందపడి ఉన్న రాజేశ్వర్‌ను హుటాహుటిన కారులో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

అంచెలంచెలుగా ఎదిగి..

జాడి రాజేశ్వర్ తన ఉద్యోగ ప్రస్థానాన్ని టైపిస్ట్‌గా ప్రారంభించారు. ఆ తర్వాత జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, తహసీల్దార్, ఆర్డీవోగా అంచెలంచెలుగా ఎదిగారు. ఉట్నూర్, ఆదిలాబాద్ ఆర్డీవోగా పనిచేసిన అనంతరం 2022 నవంబర్ 10న కాగజ్‌నగర్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ఆసిఫాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్‌వోగానూ ఆయన సేవలందించారు. విధి నిర్వహణలో కిందిస్థాయి సిబ్బందితో సొంత కుటుంబ సభ్యులుగా మెలిగేవారని తోటి ఉద్యోగులు కన్నీరుమున్నీరయ్యారు.

ప్రముఖుల సంతాపం

ఆర్డీవో రాజేశ్వర్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లాలోని ప్రముఖులు ఆయన స్వగ్రామానికి చేరుకున్నారు. కుమురంభీం జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, అధికారులు, వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అలాగే కుమురంభీం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగులు సంతాపం తెలిపారు. ఆయన రాజేశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ డీఏవో రఫత్, తహసీల్దార్ సాయన్న, డీటీ పోచయ్య, రాంలాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని వాటోలి గ్రామానికి చెందిన లక్ష్మణ్(40) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ కుటుంబీకులతో గొడవపడేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం ఆయన భార్య అమ్రపాలి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తల్లి శేషాబాయి వద్దే ఉంటున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పపోలీసులు ఘటనస్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి తల్లి శేషాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఖానాపూర్ మండలం బీర్నందిలో ఒకరు..

ఖానాపూర్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జి.లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన భుక్య గంగాధర్ (47) రోజు మద్యం తాగి ఇంట్లో గొడవపడేవాడు. ఎడ్లమందోట ప్రాంతంలో సోమవారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని ఖానాపూర్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య కళాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కళాకారుడి ఇంట్లో ఎన్ఐఏ సోదాలు

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని లచ్చంపూర్ గ్రామానికి చెందిన ప్రజా కళామండలి కళాకారుడి ఇంట్లో సోమవారం ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. ఉదయం 8 మంది సభ్యులతో కూడిన బృందం అధికారులు మావల మండలం బట్టిసావర్గాం పంచాయతీ పరిధిలో గల దుబ్బగూడలో ఆయన ఉండే నివాసానికి వెళ్లారు. అతడు అందుబాటులో లేకపోవడంతో చుట్టుపక్కల వారి ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన స్వగ్రామమైన లచ్చంపూర్‌కు వెళ్లి ఆ ఇంటిని చుట్టుముట్టారు. ఆయన కుటుంబ సభ్యులను బయటకు పంపించి ఆయన ఒక్కరినే దాదాపు రెండు గంటల పాటు విచారణ చేపట్టారు. ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. నిషేధిత సంఘాలతో సంబంధం ఉన్నదనే విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం. అయితే ఈనెల 13న హైదరాబాద్‌లోని ఎన్ఐఏకార్యాలయానికి హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ఆ కళాకారుడి ఇంట్లో సోదాలు చేయడంతో గ్రామస్తులు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు.

బాసర ఆలయ హుండీ లెక్కింపు

భైంసా: బాసర ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. 74 రోజులుగా ఆలయంలో భక్తులు కానుకల రూపంలో రూ.72,76,076ల ఆదాయం వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. 90.200 గ్రాముల మిశ్రమ బంగారం, 3.450 కిలోల మిశ్రమవెండి, 22 విదేశీ కరెన్సీ ఉందన్నారు. బాసర ఎస్‌బీఐ సిబ్బంది, పోలీసు సిబ్బంది, హోంగార్డు, వాగ్దేవి సొసైటీ సభ్యులు, సిరిసిల్లకు చెందిన శివరాకృష్ణ భజన మండలి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

ముగిసిన అర్చకుల శిక్షణ

బాసర ఆలయంలో అర్చకులకు కొనసాగుతున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 650 మంది అర్చకులకు శిక్షణ ఇచ్చారు. మూడు రోజులుగా ఒక్కో అంశంపై శిక్షణ ఏర్పాటు చేశారు. అర్చకులందరికి వైదిక స్మార్త ఆగమం, వీరశైవ, పంచరాత్ర ఆగమం, గ్రామదేవత ఆగమంలలో శిక్షణ ఇచ్చారు.

భార్యను వేధించిన భర్తకు జైలు

ఆదిలాబాద్‌టౌన్: భార్యను వేధించిన భర్తకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జేఏ ఫ్‌సీఎం ఆదిలాబాద్ పీసీఆర్ కోర్టు జడ్జి దుర్గరాణి మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆయన కథ నం ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్నూర్‌కు చెందిన మహ్మద్ పాషాకు ఆదిలాబాద్‌లోని రవీంద్రనగర్‌కు చెందిన ఓ మహిళతో వివా హం జరిగింది. తరచూ ఆయన మద్యం తాగి భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. అదనపు కట్నం కోసం ఇబ్బందులకు గురిచేసేవాడు. 2016లో బాధితురాలు మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై పద్మ కేసు నమోదు చేశారు. ఏపీపీ నవీన్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సీ మహిళపై లైంగికదాడికి యత్నించడంతోపాటు ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి డాక్టర్ పి.శివరాంప్రసాద్ మంగళవారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి జాదవ్ ఈశ్వర్‌సింగ్ కథనం ప్రకారం.. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లోని ఓ కాలనీకి చెందిన మహిళను ఆమె ఇంట్లో గత ఏప్రిల్ 19న రాత్రి అదేకాలనీకి చెందిన ఆకాష్‌సింగ్ లైంగికదాడికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో చంపేస్తానని బెదిరించి హ్యాండ్ బ్యాగ్‌లో రూ.3120 దొంగలించి పరారయ్యాడు. బాధితురాలు కాగజ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పీపీ కిరణ్ కుమార్ 9 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో ఆరు నెలల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.